# ఎర్ర జీరల కళ్ళు

బస్సు దిగగానే నాకు తారస పడిన మొదటి వ్యక్తి అతనే.

ఆ సాయంత్రం వేళ – దట్టమైన మబ్బులు, రివ్వుమని వీస్తున్న చలి గాలి, చీకట్లు ముసురు కుంటున్న సమయం – ఆకాశం మెరుపులతో భయం కలిగిస్తున్న వేళ – బితుకు బితుకు మంటూ బస్సు దిగి చుట్టూ చూసేసరికి – మామిడి తోటా, అందులోంచి సన్నని కాలి బాటా, చుట్టూ కొండలూ, తుప్పలూ, డొంకలూ. బస్సు ధూళి రేపు కుంటూ వెళ్ళి పోయింది; ఆ దిక్కు మాలిన ప్రదేశంలో నన్నొక్కర్తినీ వదిలేసి! నాకు కళ్ళ నీళ్ళ పర్యంత మయింది. కాళ్ళలో సన్నని వణుకు మొదలయింది. ఇప్పుడా ఊరు చేరడం ఎలాగ? దారీ తెన్నూ తెలీని ఆ కొత్త చోటుకి యిలాంటి వాతావరణంలో ఒక్కర్తినీ వెళ్ళ గలనా!

నాకేడుపొస్తోంది. నా పరిస్థితి నాకే అయోమయంగా ఉంది. వెంట తమ్ముడ్ని తీసుకు రావలిసిందే. దరదృష్టవశాత్తూ వాడికప్పుడే జ్వరం రావాలా! అంత జ్వరంలోనూ వాడిని నాన్నకి అమ్మకీ అప్పగించి, బయల్దేరక తప్పింది కాదు. నిజానికి యీ బస్సు ఓ రెండు గంటల ముందే యిక్కడికి చేరుకోవాల్సి ఉంది. కాని ఏవో రిపేర్లొచ్చేయి. ఖర్మ! తన పాలిట శని లాగా ఆ రిపేర్లేవో నా కోసం యివాళే రావాలా ఒక చేత్తో బేగ్‌ని రెండో చేతిలోకి మార్చుకుంటూ నిర్జనమైన ఆ వాతావరణాన్ని పరిశీలించ బోయేను. అప్పుడు కనిపించేడతను! రోడ్డు వార చెట్టుకి ఆనుకుని, బీడీ తాగుతూ నా వేపే చూస్తున్నాడు. నా దృష్టి తన మీద పడే సరికి, నోట్లో బీడీ తీసి. తుపుక్కున ఉమ్మి, "ఎవరు నువ్వు?" అనడిగేడు. నా గుండె గుబ గుబలాడింది. అలా అడుగుతున్నప్పుడు అతని ముఖంలోకి లిప్త కాలం చూసాను . ఒళ్ళు ఝల్లుమంది. నా రక్తం చల్లబడి పోయినట్టయింది. నా మెదడు మొద్దు బారి పోతున్నట్టూ, తెలీని అగాధంలోకి పడి పోతున్నట్టూ అనిపించింది.

ఆ కళ్ళు ...

ఎంత భయంకరంగా ఉన్నాయని! ఆ కళ్ళలో ఎర్ర జీరలు భయం కొల్పుతున్నాయి. మాసిన జుట్టు అసహ్యంగా ముఖం మీద చిందర వందరగా పడుతోంది. చిరుగుల బొంత, భుజాల మీద కప్పుకుని ఉన్నాడు. మొత్తం మీద అతని ఆకారం మొరటుగానూ, వెగటు గానూ ఉంది. నిప్పు కణికెల్లా వెలిగి పోతున్న ఆ కళ్ళ లోకి చూసేసరికి నాలో పిరికితనం ప్రవేశించి, నీరసం ఆవహించింది. ఎవరీ మనిషి! ఎంత భయంకరంగా ఉన్నాడు! ఈ నిర్జన ప్రదేశంలో వాడు నా కేదయినా హాని తల పెడితే! ఆకులా వణ వణలాడి పోయేను. సన్నని జల్లు మొదలయింది. మెరుపులు ఉధృత మయాయి. ఎక్కడో ఫెళ ఫెళమంటూ పిడుగు పడింది.

"ఎవరు నువ్వని అడిగితే పలకవేం, మొద్దులాగా?" నాకు అంత చల్లని వాతావరణంలోనూ గొంతు తడారి పోయింది. అతని గొంతు– గరుకు గచ్చు మీద డబ్బా రేకుతో గీసినట్టు ఎంత కఠోరంగా ఉంది! భయం చేత కాబోలు, చేతిలో బేగు రెట్టింపు బరువై పోయినట్లయి, చెయ్యి లాగేస్తోంది. చెట్టు కింద వర్షపు జల్లు పడని చోట, నిల్చుని మరో బీడీ అంటించుకో బోయేడతను. గాలి అతని ప్రయత్నాన్ని సాగనివ్వ లేదు. ఒక చెడ్డ తిట్టుతో గాలి దేవుడ్ని తలుచుకుని, బీడీ జేబులో పడేసుకున్నాడు. "మూగ దానివా!". వాడు నన్ను వదిలేలా లేదు. ఏదో చెప్పాలి, గొంతు పెగుల్చు కున్నాను. మాట బయటికి రావడం లేదు. అతి ప్రయత్నం మీద "పరిశి పాడు వెళ్ళాలి... నన్నక్కడ టీచరుగా వేసారు..." అన్నాను.

"పంతులమ్మ వన్న మాట!" నవ్వేడతను. అతను నవ్వితే వెక్కిరించినట్టుగానూ, మాట్లాడితే మీద పడి కొట్టి నట్టుగానూ ఉంటోంది. తలూపేను, అవునన్నట్లుగా. "మాటలు రాని మూగదానిలా ఉన్నావు... పిల్లకాయలకి నువ్వేం పాఠాలు చెబుతావు!" నవ్వేడు. నాకతని మీద చాలా కోపం వచ్చింది. జవాబు చెప్ప లేదు. నేను నిల్చున్న చోటి నుండి కదలక పోవడంతో ఆగి, వెను తిరిగి చూసేడతను. "మరి కాస్సేపు ఇక్కడుంటే అన్యాయంగా ఛస్తావ్... ఎలుగు బంట్లు కొండ దిగి వొస్తాయి.. పద ... పద.." అని తొందర చేసాడు. ఆ తీక్షణమైన కళ్ళతో అతను నా వేపు చూసే సరికి, అప్రయత్నంగానే ముందుకి అడుగేసాను.

దారంతా గతుకులమయం. అడుగు తీసి అడుగెయ్యడం దుర్భరంగా ఉంది. చేతిలో యీ బరువొకటి! ఛ! నా పరిస్థితి నాకే జాలేస్తోంది. ఎన్నో ప్రయత్నాల మీద, ఎందరి కాళ్ళో పట్టుకుని, ఎన్ని అవమానాలో భరించి, సంపాదించుకున్న ఉద్యోగం!

వచ్చిన ఉద్యోగాన్ని ఎలా వదులు కోవడం! కష్టమైనా, నష్టమైనా ఎన్ని బాధల కయినా ఓర్చుకుని పరిశి పాడు వెళ్ళి జాయినవక తప్పదు. సింగిల్ టీచరు స్కూలు. 'జాయినయి కొంత కాలం పని చేస్తే, కాస్త మంచి ఊరికి ట్రాన్సఫర్ చేస్తానమ్మా' అని నచ్చ చెప్పి, పంపించేసాడు బి.డి.వో. నాన్న బట్టల కొట్లో పద్దులు రాసే గుమస్తా. పండుగ సీజను కావడంతో అతనికి ఒక్క క్షణం తీరిక దొరడం లేదు. తమ్ముడ్ని రమ్మందా మంటే, వాడు మంచాన పడ్డాడు. ఒక్కర్తినీ బయలు దేరక తప్పింది కాదు. కొత్త ఊరు. దారీ తెన్నూ తెలీడం లేదు. పైగా మిన్నూ మన్నూ ఏకం చేస్తూ వర్షం వొకటి! ధైర్యం చేసి, బయలు దేరి నందుకు, బయలు దేరిన దగ్గరి నుండీ అన్నీ అవాంతరాలే! బస్సు దిగేక ఆ ఊరి వాళ్ళెవరయినా కనబడక పోతారా, అనుకుంటే తనకీ దెయ్యంలాంటి మనిషి తోడు దొరికాడు!

"చేతిలో బేగు బరువుగా ఉందా... ఇలా తే, నేను పట్టుకుంటాను..." ఈ మనిషి అప్పుడే తన పనికి నాందీ గీతం పాడుతున్నాడు... బేగ్‌లో తన చీరలు. ముఖ్యమైన సర్టిఫికెట్లూ. బంగారం గొలుసూ, కొంచెం డబ్బూ ఉన్నాయి. ఇవన్నీ వీడు దోచుకు పోతే తన గతేం కాను! దు:ఖం గొంతులో కొచ్చి గర గరలాడింది. ఏమీ చెయ్య లేని అశక్తతతో నీరసం

ముంచు కొస్తోంది. "ఫరవాలేదులే..." అన్నాను. నా స్వరం నాకే ఏదో నూతి లోంచి వస్తున్నట్టుగా వినిపించింది. "ఏమిటి ఫరవాలేదు!... నీ ముఖం!... యిలా తే... నేనేం ఎత్తుకు పోను..." నా ఆలోచనలు చదివిన వాడిలాగా అన్నాడతను. సిగ్గేసింది. "నీ సామాను మోసి నందుకు ఓ అర్ధ రూపాయి యివ్వు చాలు!" అంటూ నా చేతిలో బేగు అందు కున్నాడు.

అతని కళ్ళు నన్ను దహించి వేస్తున్నట్టు జ్వలిస్తూ వణుకు పుట్టిస్తున్నాయి. ఆ గొంతు లోని కాఠిన్యం, ప్రభుత్వం నన్ను నిస్తేజ పరుస్తున్నాయి. యాంత్రికంగా అతన్ని అనుసరించాను.

* * *

ఊరి శివార్లకి చేరే సరికి వర్షం మరింత ఎక్కు వయింది. తడిసి ముద్దయి పోతున్నాం, యిద్దరమూ. శరీరంలో చలికి, భయానికి సన్నని వణుకు పుడుతోంది. నా ఉద్యోగ జీవితం ఇంత భయానకంగా మొదలయిందేం!

"ఎక్కడికి కెళ్తావు?" అవును! ఎక్కడి కెళ్ళాలి... మొదటి సారిగా ఆ విషయం స్ఫురించి వెన్నులోంచి వణుకు మొదలయింది... ఆ.. ప్రెసిడెంటు గార్ని కలవాలి, ముందు. అదే అన్నాను అతనితో. అతను పెద్ద పెట్టున నవ్వేడు. "సెభాష్.. వాడింటికా!... అదీ ఈ సమయంలోనా! మంచి దానివే... వాడిప్పుడు తాగి తొంగుంటాడు... వాడి పెళ్ళాం చచ్చి రెండేళ్ళయింది... ఊర్లో ప్రతీ ఆడ కూతురూ వాడి కళ్ళకి పెళ్ళాం లాగానో, సాని పాప లాగానో కనిపిస్తుంది. ఆపైన నీ యిష్టం!..."

నాకు తల దిమ్మెత్తి పోయింది. ప్రళయం వచ్చి, ప్రపంచమంతా తుడిచి పెట్టుకు పోయి, ఓ మనిషి మాత్రమే మిగిల్తే – అతడు కూడా నా అంత వంటరిగా, నిస్సహాయంగా, ఏకాకిగా అయి పోయినట్లు చలించి పోడేమో! ఇప్పుడేం చెయ్యడం! దేవుడా, నాకు దారేది! ఈ ఉద్యోగం చెయ్యాల్సిన అగత్యమే లేక పోతే, ఇవాళ నాకీ నరకం తప్పేది కదూ! "వెళ్తావా?" అతను ముందుకు అడుగేసాడు. నేను ఆగి పోయేను. "బాగా తడిసి పోయేవు... ఇదిగో ఈ గుడిసెలోనే నేనుండేది... పద... యీ రాత్రికి యిక్కడ తల దాచుకుందువి గాని" అంటూ ఓ గుడిసె లోకి దారి తీసాడు. ఎన్నో భయాలతో, సందేహాలతో, ఆరాటంతో అవాక్కయి ఉండి పోయేను. కళ్ళ ముందు జరుగు తున్నదంతా పీడ కల కాదు కదా! ఒకటి ఒంటరి అంకెలా నిలబడి పోయేను.

"రావేం, పంతులమ్మా!... నీకేం కాదులే..." ఆ ఎర్ర జీరల కళ్ళు నన్ను రమ్మని శాసిస్తున్నాయి. వాటి తీక్షణతకి తట్టుకునే శక్తి నాలో మరింక లేదు. లోపలికి వెళ్ళాను. అతను లాంతరు వెలిగించాడు. 'డబ్బులివ్వు' చెయ్యి చాచేడు. ఓ అర్ధ రూపాయి తీసి, అతని చేతిలో ఉంచేను. "చాలదు... మరో నాలుగు రూపాయలివ్వు" అడిగేడు. వాడి పీడ వదిలించుకుందుకి పది రూపాయలివ్వడాని కయినా నేను సిద్ధమే. తీసి యిచ్చేను. కంపు కొడుతున్న చింకి తువ్వాలు నా చేతి కందించి, "తల తుడుచుకో... జలుబు చేస్తుంది" అని హెచ్చరించి, ఎటో వెళ్ళి పోయేడు. నేనిచ్చిన డబ్బుతో మళ్ళీ పీకల దాకా తాగడానికి కాబోలు. వీడు మళ్ళీ వచ్చే లోగా ఇక్కడి నుండి బయట పడాలి...

చుట్టూ చూసేను. ఛీ! ఏం కొంప యిది! మనుషులుండేదేనా!... ఎక్కడి వస్తువులక్కడే చిందర వందరగా పడి ఉన్నాయి. కుక్కి నులక మంచం, దాని మీద మాసి పోయి, అట్టలు కట్టిన చింకి బొంత. కంపు గొడుతున్న గలీబు లేని తల దిండు. రెండు మూడు లొత్తలు పడిన సిల్వరు గిన్నెలు. ఓ గొరక చీపురు. వర్షం అంతా వాడింట్లోనే ఉంది. అంతా గలీజుగా ఉంది. నా కేదు పొస్తోంది. నా ఆలోచనలు ఘనీభవించి పోయి, నా మీద నాకే విరక్తి లాంటిది కలిగింది. తల తుడుచు కుని, బట్టలు పిండుకుని, పొడి బట్టలు మార్చు కున్నాను. వాడు రాకుండా ఆ దరిద్రం కొంప వదిలి పోవాలనే ఆత్రుతలో తయారవుతూ ఉంటే, వాడొచ్చేడు! చేతిలో ఓ కాగితం పొట్లం, మరో చేత్తో గాజు గ్లాసుతో టీ కాబోలు, తెచ్చేడు.

"నే నొచ్చీ లోగా యిక్కడి నుండి పారి పోదా మనే!... పిచ్చి తల్లీ! ఈ రాత్రమ్మట ఎందల పడి పోతావు!..." లాభం లేదు... వీడు నన్ను చది వేస్తున్నాడు! "ఇంద, యీ కుడుం తీసుకో!... చల్లగా ఉంది. చచ్చినోడు ఎప్పుడు చేసాడో... అయినా, ఏదో తినాలి కదా! కడుపు కాల్చు కుని పడుకోలేవు కదా! ..." అని పొట్లం నా చేతికి అందించేడు. ఆకు మూత వేసి తెచ్చిన టీ గ్లాసు ప్రక్కన ఉంచేడు. మిగిలిన చిల్లర పైసలు చేతికందించేడు. అతని నోటి వెంట సారా కంపు నా ముక్కు పుటాల్ని బద్దలు కొడుతోంది. "నా అర్ధ రూపాయి తోనే తాగేను... ఆ కొట్టోడు నాకయితే అర్ధ రూపాయికే యిస్తాడు; అసలు నేను డబ్బులు ఇవ్వక పోయినా యిస్తాడ్లే!..." అని వెకిలిగా నవ్వేడు. వెర్రి దానిలా అతని వేపు చూసేను.

"తిని పడుకో... టీలో తీపి సరి పోయిందో లేదో చెప్పు, సరిపోక పోతే ఆ నా కొడుకుని నరికి పోగులు పెట్టేస్తాను–" నేను బలవంతాన ఓ ముక్క కొరికి ఏదో తిన్నాననిపించాను. టీ చేదుగా ఉంది. అయినా, బాగుందని తలూపేను. తర్వాత అతను మూల నున్న చింకి చాప తీసుకుని, గుడిసె బయటికి వెళ్ళి గడపలో పడుకున్నాడు. "తలుపేసుకో!" అరిచాడు పైనుంచి. ఎంత చిత్రమైన వ్యక్తి!

* * *

మర్నాడు స్కూల్లో జాయినయేను. ఆ వ్యక్తి నాకు చేసిన సహాయాన్ని తలుచు కుంటే ఆశ్చర్యం కలుగుతోంది. అతని సాయమే లేక పోతే, తను అంత రాత్రప్పుడు, ఆ చీకట్లో, వర్షం లో – ఏమై పోయి ఉండేదో! మనిషి కరుగ్గా కనిపించినా మంచి వాడి లాగే ఉన్నాడు. అతవి గురించి ఎంత నీచంగా ఆలోచించింది తను! ఓ యిల్లు అద్దెకి తీసుకుని, శలవు పెట్టి విజయనగరం వెళ్ళి, మరి కొంత సామానుతో పాటు, వెంట తమ్ముడ్ని తీసుకుని వచ్చేను. రోజులు గడుస్తున్న కొద్దీ ఆ వాతావరణం నాకు అలవాటయి పోయింది. ఈ లోగా ఆ వ్యక్తి గురించి విచిత్రమైన విషయాలెన్నో విన్నాను. ఆశ్చర్య పోయేను! అతనికి చిల్లంగి, చీడ పెట్ట గలిగే క్షుద్ర శక్తి వుందిట!... నాకు వాటి పట్ల విశ్వాసం లేదు. ఆ చిన్న గ్రామంలో నా మాటలకి విలువ ఉండదని నాకు తెలుసు. అందుకే

వాళ్ళు చెప్పింది విని, ఊరుకున్నాను. "నీ అదృష్టం బాగుంది తల్లీ! ... అడి సేతిల బడి, రేత్రంతా ఆడి కొంపలో తొంగుండి, నీకేటీ కానేదంటే దేవుడు నిన్ను కాసేడనే సెప్పాలి! పంతులమ్మ గోరూ! ఆడి కళ్ళు సూసేరు కదా, అగ్గి నిప్పు కణికెల్లాగ! చిల్లంగెడతాడమ్మా! ఆడు మంచోడు కాదు! మాం ఆడి పీడ పడ నేక సత్తన్నాం... కొట్టి సంపీద్దుం కాని, అదొక తగువై పోతాదని ఊరుకున్నాం ... ఆడు ఎవురి మీద కోపగించు కుంటే ఆడు నాశినవే! అని, పాలూ, పెరుగూ యిచ్చే నారాయణ తాత చెప్పేడు. స్కూల్లో పిల్లలు కూడా ఆ మనిషి గురించీ, వాడు చిల్లంగి పెట్టిన వాళ్ళ గురించీ ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారు. వద్దన్నా వినేలా లేరు.

* * *

రాను రాను ఆ వ్యక్తి మీద గ్రామంలో వ్యతిరేకత ఎక్కువ కాసాగింది. అతడ్ని గ్రామం నుండి తరిమేయాలనే పట్టు దల వారిలో అధికం కాసాగింది. నాకు తెలిసినంత వరకూ అతను ఎవరికీ వ్యక్తి గతంగా హాని చేసినట్లు లేదు. అతని కెవరూ పని చెప్పరు. అతనితో మాట్లాడరు. పలకరించరు. భయం కొద్దీ, అతనికి దూరంగా మెసులుతూ ఉంటారు. అతను కూడా ఆ రకమయిన జీవితానికి అలవాటు పడిపోయినట్లు కనిపిస్తాడు. ఎప్పుడూ, ఎవరి మీదో కోపంగా ఉన్నట్లు ప్రవర్తిస్తూ ఉంటాడు. గ్రామంలో ఒకటి రెండు కుటుంబాలలో పిల్లలు, ఓ వయసు మీరిన వ్యక్తి హఠాత్తుగా మంచాన పడి, అంతు పట్టని జబ్బుతో చనిపోవడం కూడా జరిగింది. దీనితో గ్రామంలో అతని మీద ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. అతనిని ఎలాగయినా-హత మార్చాలన్న పట్టుదల కొందరిలో ఎక్కువ కాసాగింది. నాలో తీవ్రమయిన భావ సంచలనం మొదలయింది. జరగబోయే దారుణాన్ని ఎలాగయినా ఆపాలనిపించింది. గ్రామంలో మరణాలకి, అతనికీ ఏమీ సంబంధం లేదని వాళ్ళకి ఎలా నచ్చ చెప్పడమో తెలీడం లేదు! చెప్తే అర్థం చేసుకుంటారా? నన్నే పిచ్చిదానిలా చూస్తా రేమో! ఇదిలా ఉండగా, నిన్న రాత్రి నుండీ తమ్ముడికి కూడా ఒంట్లో ఏమీ బాగుండడం లేదు. జ్వర తీవ్రతతో రాత్రంతా ఒకటే పలవరింతలు! చాలా భయం వేసింది. అందు బాటులో ఉన్న వైద్యం చేయించాను. తగ్గక పోతే విజయ నగరం తీసుకు పోవాలి. రాత్రంతా వాడు ఎగిరెగిరి పడుతూ, వెర్రి చూపులు చూస్తూండడంతో నాకు ప్రాణం అర్చుకు పోయింది. అదృష్టవశాత్తు ఉదయానికి బాగా నిమ్మళించింది. చుట్టు పక్కల వాళ్ళువచ్చి చూసి వెళ్ళారు. "నీకు తెల్దు, మేష్టమ్మా! ఆ ఎదవ మీ తమ్ముడికి చిల్లంగెట్టీసి నాడు... మాం సెప్ప నేదా!..." వాళ్ళ మాటలు ఓ ప్రక్క భయాన్నీ, మరో ప్రక్క చిరాకునీ కలిగిస్తున్నాయి.

తమ్ముడికి కాఫీ యిచ్చి, స్కూలికి బయలు దేరాను. దారిలో ఆ గుడిసె దగ్గరకి వచ్చే సరికి, అతను అరుగు మీద కూచుని చొక్కాకి చిరుగులు కుడుతూ కనిపించేడు. పలకరింపుగా నవ్వేడు. "ఇలా రా!" పిలిచేను. ప్రశ్నార్థకంగా నా వేపు చూసి, ఎందుకన్నట్టు తలెగరేసాడు. "నీతో కొంచెం మాట్లాడాలి...అలా స్కూలి వేపుకి పద..." అంటూ నడిచేను. అతను నన్ను అనుసరించాడు. స్కూలు సమీపానికి వచ్చేక, అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ

"నేనొకటి అడుగుతాను ...నిజం చెబుతావా!" అనడిగేను. విసురుగా తలెగరేసాడు. నేను లక్ష్య పెట్టలేదు. రాత్రి తమ్ముడి పరిస్థితి నన్ను చాలా వ్యాకుల పరిచింది. ఇవాళ వీడి సంగతి తేల్చుకోక తప్పదు అనే పట్టుదలతో ఉన్నాను. "గ్రామంలో అంతా నీ మీద చాలా కోపంగా ఉన్నారు... నిన్ను చంపినా చంపీసేలా ఉన్నారు, తెలుసా!..." అడిగేను ఉపోద్ఘాతంగా. అతను పొగరుగా, నిర్లక్ష్యంగా నా వేపు చూసేడు. "దద్దమ్మలు, పిరికెదవలు, నన్నేటి సెయ్యగలరు?" అన్నాడు తలెగరేస్తూ. "అంతా నీకు చిల్లంగి పెట్టడం వొచ్చనీ, నీకలాంటి శక్తులున్నాయనీ నమ్ముతున్నారు... ఊళ్ళో యీ మధ్య చావులకి నువ్వే కారణమని కూడా అంటున్నారు... నిజం చెప్పు, నీకా శక్తులున్నాయా! అసలు చిల్లంగి పెట్టడం అనేది జరుగుతుందా?" అడిగేను, సూటిగా. "నీకు నమ్మకం ఉందో లేదో చెప్పు" అన్నాడు, అంతే సూటిగా. తికమక పడ్డాను. నమ్మకం లేదన్నట్టుగా తల అడ్డంగా ఊపేను. "మీ తమ్ముడికి రాత్రంతా జ్వరమటగా?" అన్నాడు హఠాత్తుగా. నేను నివ్వెర పోయేను. "మరింక పిచ్చి ఆలోచనలేవీ పెట్టుకోకుండా నీ మానాన నువ్వుండు... ఫో!.." అనేసి, నా జవాబు కూడా వినకుండానే అక్కడి నుండి గబ గబా వెళ్ళి పోయాడు. చేసేదేం లేక చూస్తూ ఉండి పోయాను.

* * *

ఆ రాత్రి కూడా మళ్ళీ తమ్ముడికి విపరీతంగా జ్వరం వచ్చింది. హడలి పోయాను. కాళ్ళూ చేతులూ ఆడ లేదు. దగ్గరున్న మాత్రలేవో వాడి చేత మింగించాను. ఆ రాత్రి నా పాలిట కాళ రాత్రి లాగే గడిచింది. తెల్ల వారుతోంది. ఓ నిర్ణయానికొచ్చేను. ఇంకా చీకటి తెరలు వీడ లేదు. సన్నగా చినుకులు పడుతున్నాయి. రాత్రంతా సరిగా నిద్రలేదేమో, తమ్ముడు యిప్పుడే నిద్ర లోకి జారుకున్నాడు. వాడిప్పట్లో లేవడు. తలుపు తీసుకుని వీధిలో కొచ్చేను. పక్కింటి గౌరి యింటి ముందు కళ్ళాపి జల్లుతోంది. పిలిచాను."తమ్ముడికి జ్వరం. లేవడం లేదు. నేను ఆచారి గారి దగ్గరకెళ్ళి ఏదేనా మందు తీసుకొస్తాను. కాస్త చూస్తూ వుండు, ఏం!" అని చెప్పాను. ఆమె తలూపింది. ఇంట్లోకి వెళ్ళి తమ్ముడు నిద్ర పోతున్నాడని మరో సారి నిర్ధారణ చేసుకుని, బయలు దేరాను. వెళ్ళే ముందు రాత్రి తిన బుద్ధి కాక వొదిలేసిన ఉప్మాని పొట్లం కట్టి, బయలు దేరాను.

* * *

ఊరింకా నిద్ర లేవ లేదు. గబ గబా నడుస్తున్నాను. ఆచారి గారిల్లు దాటి, మరింత ముందుకి సాగేను. ఆ గుడిసె ముందు ఆగేను. నా గొంతు విని, బయటి కొచ్చేడు అతను, ఆ ఎర్రజీరల కళ్ళ మనిషి! ఆశ్చర్యంగా నా వేపు చూసేడు. చేతిలో పొట్లం అందించేను. తీసుకుని విప్పి చూసేడు. అతని కళ్ళు మెరిసాయి. ఆత్రంగా పాచి నోటితోనే తినడం మొదలెట్టాడు. వాడు తింటున్నంత సేపూ మాట్లాడ కుండా ఉండి పోయాను. తర్వాత అన్నాను: "మా తమ్ముడికి మళ్ళీ జ్వరం వచ్చింది!" అని. నా గొంతులో ఏ తీవ్రత కనిపించిందో, మనిషి కొంచెం చలించి నట్టు కనిపించేడు. అంతలోనే సర్దుకుని,

"అయితే?..." అన్నాడు బొంగురు గొంతుకతో. "మామూలు జ్వరమే... భయం లేదు! ... ఇవాళ చూసి, విజయ నగరం తీసికెళ్తాను. మంచి వైద్యం చేయిస్తే అదే తగ్గి పోతుంది..." అన్నాను ధృఢంగా.

అతని కళ్ళలో చప్పున నీళ్ళు తిరిగాయి. చేతులెత్తి దండం పెడుతూ గద్గద స్వరంతో చెప్పడం ప్రారంభించాడు: "క్షమించు పంతులమ్మా! నీకు తెలిసిందే, నాకు చిల్లంగీ తెలీదు, చీడా తెలీదు... నా కళ్ళు మొదటి నుండీ యిలాగే ఉంటాయి... ఏదో జబ్బని పెద్దాసుపత్రిలో చెప్పారు. వైద్యం చేయించుకునే శక్తి లేదు. పొట్ట చేత్తో పట్టుకుని యీ ఊరొచ్చేను. ఆకలికి మల మలా మాడి పోయానే తప్ప నా కెవరూ పనివ్వ లేదు. కారణం, నా కళ్ళు చూసి! నాకేదో చిల్లంగి పెట్ట గలిగే శక్తి ఉందని వీళ్ళంతా నమ్మేరు!... అందుకే అందరికీ నన్ను చూస్తే బెదురు!... బ్రతుకు తెరువు కోసం వాళ్ళ భయాన్నీ, తెలివి తక్కువ తనాన్నీ వాడు కుంటున్నాను. ఏ గడప ముందుకి వెళ్ళి అడగినా భయం వల్లనే కావచ్చు, ఎవరూ కాదని పొమ్మనరు. ఏదో యింత పడేస్తారు. పడీసి, ఆడంగులు వెంటనే తలుపులు వేసీసుకుంటారు...ఏమయితే నేం, పని లేక పోయినా, వేళకింత ముద్ద దొరుకు తోంది. వాళ్ళని భయ పెట్టాలని నేననుకో లేదు పంతులమ్మా!...వాళ్ళే పిరికిగా, భయంతో నానుంచి పారి పోతున్నారు... రాను రాను, వాళ్ళ బలహీనతని నేనూ ఉపయోగించుకోడం మొదలెట్టాను... వీళ్ళు నన్నేదో చేస్తారనే భయం నాకు లేదు. ఈ ఊరి వాళ్ళు వొట్టి పిరిగ్గొడ్డులు! ఆ సంగతి నాకు బాగా తెలుసు! అమ్మా!... నీ దగ్గర దాచ లేక యిదంతా చెప్పేను. కడుపుల్లో ఉంచుకో తల్లీ!... ఎవరితో నయినా అన్నావా, నా పొట్ట కొట్టి నట్టే!..." అతని గొంతు లోనుండి ఒక్కొక్క మాటే తడి తడిగా వచ్చేయి .

నిశ్చేష్టురాలినై పోయేను! జానెడు పొట్ట కోసం ఎన్ని తిప్పలో... ఆ క్షణంలో అతని కోసం ఏదో చెయ్యాలనిపించింది. ఏదో చేయాలి!.. వీలయినంత త్వరగా...

* * *

మునసబు గారి అబ్బాయి, పదేళ్ళ వాడు – మంచాన పడడంతో గ్రామంలోని పరిస్థితి అదుపు తప్పింది. ఉద్రేకంగా అంతా కర్రలుతీసుకుని, అతని మీదకి బయలు దేరారు. నేను వారించడానికి ఎంత ప్రయత్నించినా లాభం లేక పోయింది. తరతరాలుగా వాళ్ళలో పాతుకు పోయిన అంధ విశ్వాసాలని నాకున్న కొద్ది పాటి వివేచనా శక్తి జయించ లేక పోయింది

నా కళ్ళ ఎదురుగానే ...

ఆ రాత్రి – దిక్కూ మొక్కూ లేక, బిక్కు బిక్కు మంటూ ఊరు చేరిన నాకు, ఆకలితో పస్తు పడుకో వలసిన దానికి సాపాటు అమర్చిన ఆ చేతులు... యిప్పుడు అమానుషంగా తన మీద పడుతున్న దెబ్బలని అడ్డుకో డానికి విఫల ప్రయత్నం చేస్తున్నాయి... దీనంగా అరిచే అతని ఆక్రోశాన్ని విన లేక బాధతో విల విలలాడి పోయేను. పెద్దగా రోదిస్తూ, రక్తసిక్తమయిన దేహంతో, వారి మూఢ నమ్మకాలకి బలి పశువై పోయి, దారుణంగా హింసించబడి, దిక్కు తోచని విధంగా పారి పోవడం మొదలెట్టాడు. అతని వెనుక ... రాళ్ళు విసరుతూ...

బూతులు తిడుతూ... వాడి పీడ తమ గ్రామానికి వదిలి పోతున్నందుకు ఆనందంగా... అతన్ని వెంట తరుముతూ- పెద్దలూ... పిన్నలూ...

* * *

తటాలున మెలకువ వచ్చింది! ఇదంతా కలా! గుండె జలదరించుకు పోయింది. ముందు రోజు రాత్రంతా తమ్ముడికి సేవలు చేస్తూ నిద్ర లేకుండా గడిపానేమో, నిద్ర పట్టేసింది. అయినా, తమ్ముడి గురించిన భయంతో కలత నిద్రే పట్టింది... నిద్రలో యీ భయంకరమైనకల! నాకు వొళ్ళు చెమటతో తడిసి పోయింది. గుండె దడ ఎంతకీ తగ్గడం లేదు. ఇది... ఇది, యిప్పటికి కలే కావచ్చు... రేపు వాస్తవమైతే? వణికి పోయేను. ఆ క్షణంలోనే ఓ నిర్ణయాని కొచ్చేను. అతని కోసం ఏదో చెయ్యడానికి యిక అట్టే వ్యవధి లేదు! చేసేదేదో వెంటనే చెయ్యాలి!..

తమ్ముడికి జ్వరం పూర్తిగా తగ్గి పోయి నట్టుంది! నా వేపు చూసి ఉల్లాసంగా నవ్వుతున్నాడు!

* * *

ఆ తర్వాత... నెల రోజులకి ...

శలవుల అనంతరం అమ్మతో పాటు, వద్దంటున్నా వినకుండా ఆవిడ సర్దిన పెద్ద లగేజీతో ఆ ఊళ్ళో బస్సు దిగాను. నా కోసమే ఎదురు చూస్తూ, రిక్షా గబ గబా తొక్కు కుంటూ వస్తున్నాడతను. పలకరింపుగా నా వేపు చూసి నవ్వుతున్నాడు...

అతని కళ్ళు ఎర్ర జీరలతో భయంకరంగా ఉన్నాయి...

అయినా, మంచిగానే ఉన్నాయి!

* * *

*1977లో యువ మాసపత్రికలో ప్రచురితం.*